విశాలాంధ్ర గుంటూరు జిల్లా

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడం అభినందనీయం: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : నగరపాలక సంస్థ పరిధిలోని వెహికల్ షెడ్‌లో తొలగించిన చినపోతుల విజయ్ కుమార్, శ్రీను, రోశయ్య, కొండయ్య, శివప్రసాద్, చంద్రశేఖర్ కార్మికులని నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి తిరిగి వీధుల్లోకి తీసుకోవడం హర్షణీయమని సీపీఐ నగర కార్యదర్శి కోట మాలాద్రి అన్నారు. ఈ సందర్భంగా 17వ డివిజన్లో సీపీఐ స్థానిక నాయకత్వం కార్మికులకు మిఠాయిలు పంచారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సుదీర్ఘ పోరాట ఫలితంగా కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు చినబోతుల వెంకటరావు, గోవిందు పాల్గొన్నారు.

ఎస్ఎం సుభానికి ఉగాది సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని ఉగాది సందర్భంగా అవగాహన సంస్థచే సత్కారాన్ని అందుకున్నారు. దశాబ్దరన్నర కాలంగా అంకితభావంతో జిల్లా రచయితల సంఘం తరపున పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహిత్య రంగానికి విశేష కృషి సల్పిన సుభానిని ఉగాది సందర్భంగా శాలువాతో సత్కరిస్తున్నట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూర్తి, బండికల్లు జమదగ్ని, డాక్టర్ ఎం.లలిత కుమారి, ఏవీకే సుజాత, పోగుల విజయశ్రీ, పింగళి భాగ్యలక్ష్మి, కొణతం నాగేశ్వరరావు, నానా, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, పోతురాజు దుర్గాదేవి, బషీరున్నీసా బేగం, షేక్ కాసింబి, మాధవి ఇతర సాహితీ మిత్రులు పాల్గొని సత్కారం అందుకున్న సుభానికి అభినందనలు అందచేశారు.

ఉర్దూ ప్రాథమిక పాఠశాలల తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు : కొల్లిపర మండలంలోని కొల్లిపర, మున్నంగి, పిడపర్రు గ్రామాలలో ఉన్న మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం, కొల్లిపర మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఎఫ్ఏ 4 ప్రశ్నాపత్రాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఉర్దూలో బోధించాలని, ఎఫ్ఏ 4 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయు సౌకర్యం ఇవ్వగానే త్వరితగతిన నమోదు చేయాలని సూచించారు. నాడు-నేడు పథకం ద్వారా మండలంలోని ఉర్దూ పాఠశాలల దశ మారిందని గతానికి భిన్నంగా ఉర్దూ పాఠశాలలు చాలా చక్కగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్‌లకు పాత విధానమే కొనసాగించాలి

విశాలాంధ్ర-గుంటూరు : పురపాలక ఉపాధ్యాయులు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు అన్నీ కలిపి యూనిట్‌గా కాకుండా బదిలీలు, ప్రమోషన్‌లో పాత విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్(1938) కోరుకుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టిబోయిన నరసింహారావు ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఒక జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు ఒక యూనిట్ మున్సిపల్ కార్పొరేషన్లు ఒక యూనిట్, గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ విశాఖపట్నంకు విడివిడిగానే రూల్స్ ఉన్నాయనీ, బదిలీలు, ప్రమోషన్‌లు ఆయా పరిధిలోనే జరుగుతున్నట్లు, అదేవిదంగా ఉంచినచో ఉపాధ్యాయులకు ప్రయోజకరమనీ సుబ్బారావు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, పురపాలక ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అంటూ జిల్లా యూనిట్‌గా బదిలీలు, ప్రమోషన్‌లు జరపడం అంటే, విద్యాశాఖ స్థానిక సంస్థల అధికారాలను హరించడమేనని, ఇది న్యాయ శాఖ పరిధిలో కూడా నిలవదని, ఈ విధానాన్ని 90 శాతం మున్సిపల్ ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర-తాడికొండ : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్నదని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గరికపాడులో గురువారం గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, వైసీపీ నాయకులు తాళ్ల శివ నాగరాజు, ఉండవల్లి నరసింహారావు, కుక్కమల్ల జగన్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధంకండి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : కార్మిక వర్గంపై దాడులు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఉద్యోగ, కార్మిక సంఘాలు పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని వీఎస్‌కే హాల్లో ఏఐటీయూసీ గుంటూరు నగర 11వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇరువురు ఉద్యోగ, కార్మిక వర్గాలపై సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఉన్నటువంటి ప్రజల సంపదతో నిర్మించిన పరిశ్రమలను, ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అమ్మేస్తున్నారని, లేబర్ కోడ్‌లను తీసుకొని వచ్చి కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నారని వారు విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తా ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేతుల్లో జగన్‌మోహన్ రెడ్డి కీలుబొమ్మగా తయారయ్యాడని ఎద్దేవాచేశారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్దఎత్తున ఉద్యమించాలని, యావత్ కార్మిక లోకం మరో స్వాతంత్ర ఉద్యమానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన ఏఐటీయూసీ పతాకాన్ని ముఠా కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ మహాసభలలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బందెల రవికుమార్, జిల్లా కన్వీనర్ హనుమంతరావు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వద్దే బాలయ్య, ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి మంగా శ్రీనివాస్, గుంటూరు నగర ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు సురేష్ బాబు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నూతన నాయకత్వం ఎన్నిక

మహాసభల సందర్భంగా 33 మందితో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా రావుల అంజిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆకిటి అరుణ్ కుమార్ ఎన్నికయ్యారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్త కుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరాపై ఏఈల వారిగా సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారు లను ఆదేశించారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో నగరంలో త్రాగునీటి సరఫరా, అభివృద్ధి పనులలో ఇతర శాఖల సమన్వయం, పార్క్‌ల అభివృద్ధి తదితర అంశా లపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డ్‌లో వార్డ్ పేరు కనిపించేలా బోర్డ్‌లు ఏర్పాటు చేయాలని, నగర పాలక సంస్థ జెట్టింగ్ మెషిన్‌లకు టోల్ ఫ్రీ నంబర్ పెయింట్ చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పనుల్లో ప్రజారోగ్య శాఖతో ఇంజినీరింగ్ అధికారులు సమ న్వయం చేసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపిసిపిడిసిఎల్ ఈ.ఈ. శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

పన్ను రాయితీని వినియోగించుకునేలా చూడాలి

రాష్ట్ర ప్రభుత్వం ఏకమొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులకు మరో 8 రోజుల్లో గడువు ముగియనున్నదని, లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్లు (ఎల్.టి.పి.) భవన నిర్మాణ యజమానులకు తెలియచేసి పన్ను రాయితీని వినియోగించుకునేలా చూడాలని నగర కమీషనర్ కీర్తి చేకూరి కోరారు. గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎల్.టి.పి.లతో ఖాళీ స్థల పన్ను వసూళ్లు, పన్ను రాయితీ పై ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, క్రేడాయ్, నెరెడ్కో ప్రతినిధులు, అసిస్టెంట్ సిటి ప్లానర్లు, టి.పి.ఎస్.లు, ఆర్.ఓ.లు, ఆర్.ఐ.లు, ఎల్.టి.పి.లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మాథమెటిక్స్ 1 బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు మొత్తం 560 మందికి గాను 552 మంది హాజరైనట్లు, 8 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకట రాము కలెక్టర్‌కు తెలియజేశారు. ముందుగా కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ టీవి ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం గదులలో విద్యార్థులు పరీక్ష వ్రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను పరిశీలించారు. పరీక్షలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ ఇంటర్మీడియట్ బోర్డు సునీత, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ రత్న శేఖర్, కస్టోడియన్ ఆర్.మరియదాసు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, తహశీల్దార్ సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పార్టీ శ్రేణులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ అధికార ప్రతినిధులు ఓ పేపరులో వ్రాసే తప్పుడు రాతలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. పూర్తికాని పార్లమెంట్ అనుబంధ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీచేయుచున్న టీడీపీ అభ్యర్థి కె.వీ.కె సురేష్‌ని లీగల్ సెల్ సభ్యులందరు కలిసి గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం వైసీపీ పాలన అప్రజాస్వామికంగా వుంది. అన్ని అనుబంధ సంఘాలు కలిగి ఈ ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలన్నారు. తూర్పు ఇంచార్జి నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి అన్ని శక్తులు కలిసి పనిచేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, శాఖమూరి నారాయణ ప్రసాద్, అడకా శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, గోళ్ళ ప్రభాకర్, షేక్ మీరావలి, దామచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకే రాహుల్ అరెస్ట్

విశాలాంధ్ర-గుంటూరు : నరేంద్ర మోదీ తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రాహుల్ గాంధీని అరెస్ట్ చేయించారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. గుంటూరు రాజీవ్‌గాంధీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ రాహుల్ గాంధీని అరెస్టు చేయించడం దారుణమని అన్నారు. అదానీ లాంటి ఆర్థిక నేరస్థుడు గురించి రాహుల్ గాంధీ మాట్లాడటం, శ్రీలంక, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో అదానీకి కాంట్రాక్టులు ఎలా వస్తున్నాయని పార్లమెంట్‌లో రాహుల్ గాంధీని ప్రధానిని నిలదీయడంతో తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడుదారులు వెతుకుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ధైర్యం ఉంటే అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వర రావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం పాల్ విజయ్ కుమార్, మోహన్‌రావు, మోషే, కరీమ్, అంకమ్మ చౌదరి, రఫీ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఆళ్ళ దాస్, కృష్ణ, దేవరపు శ్రీనివాస్, బాబు, ఇస్మాయిల్, అనిల్, మహమ్మద్ అలి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు బారాఇమామ్ పంజా సెంటర్‌లోని హుదా డిజిటల్ జానీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు గురువారం నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమీల్ అహ్మద్ బేగ్ మాట్లాడుతూ తెల్లదొరల బానిస సంకెళ్ల నుంచి భారతీయులను విముక్తి చేయడానికి తమ ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు వారి వీరమరణానికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అహద్, అయూబ్ ఖాన్, సయ్యద్ ఫాతిమా, జానీ తదితరులు పాల్గొన్నారు.

సంఘసేవ పరాయణులు ఏకా దండయ్య పంతులు

విశాలాంధ్ర-గుంటూరు : 183 సంవత్సరాల క్రితం గుంటూరు నగరంలో జన్మించి తాను గడించిన దాంట్లో దాని ద్వారా 1944 సంవత్సరంలో తన వీలునామా ద్వారా విద్య, వసతి గృహాలు, ధార్మిక, సమాజ హిత కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయల ఆస్తులు అందించిన కీర్తిశేషులు ఏకదండయ్య పంతులు గుంటూరు నగరం, జిల్లా గర్వించదగ్గ సంఘసేవ పరాయణులుగా పేర్కొనవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. శ్రీ ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట మాజేటి గురవయ్య హైస్కూల్ ఆడిటోరియంలో ఉగాది మహోత్సవాలు వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన చారిటీస్ మేనేజింగ్ ట్రస్ట్ కోటమరాజు శేష చంద్రమౌళీశ్వర రావు మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు తన ప్రధాన వీలునామాలో పేర్కొన్న విధంగా ప్రతి ఏడాది ఉగాది ఉత్సవాలు, ప్రముఖులను ఆయన పేరున సత్కరించడం జరుగుతున్నదని వివరించారు. ఈ సందర్భంగాప్రముఖ న్యాయవాది కొండూరి కృష్ణారావు, రాజ్యలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, న్యాయవాది జూపూడి రంగరాజు, డాక్టర్ దీవి హరిప్రసాద్, ట్రస్టీలు కేఎస్ఆర్ కుటుంబరావు, కొండూరి నంద కిషోర్, భట్రాజు కృష్ణకిషోర్, కేసానుపల్లి శ్రీరామసుబ్బారావు, నెప్పల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు సమీపంలోని కాళీ గార్డెన్స్ ప్రాంగణంలో కాళీ గార్డెన్స్ ఆశ్రమాధిపతి శ్రీ కాళీ వనశ్రమం యోగి, శ్రీ చంద్ర కాళీ ప్రసాద్ మాతాజీ చేతుల మీదుగా 'బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్' గురువారం ఘనంగా ప్రారంబించారు. ఈ ప్రారంభోత్సవానికి బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ మన్మోహన్ గుప్తా ముఖ్య అతిథిగానూ పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ జోన్‌లో మొదటి డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ గుంటూరు సమీపంలోని నంబూరులో ప్రారంబించామన్నారు. ఈ యూనిట్ ద్వారా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాదాతారులు పూర్తి స్థాయిలో పొందవచ్చన్నారు. డిజిటల్ సర్వీసెస్ అన్ని కూడా డిజిటల్ యూనిట్ అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రీజనల్ హెడ్ పి.అమర్నాథ్ రెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎం. విద్యాసాగర్, డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ గుంటూరు బ్రాంచి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను మోసం చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-తాడికొండ : రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తుందని జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ ఆరోపించారు. కంతేరు గ్రామంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఉద్యోగాల భర్తీ లేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తిగా తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతుందని అన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్ యూనివర్సిటీ తరపున న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గురువారం ఘనంగా సన్మానించారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన షేక్ అస్విల్ అహ్మద్ (బీసీఏ-మూడో సంవత్సరం), చాగం రాఘవి(బీబీఏ ఎల్ఎల్‌బీ-రెండో సంవత్సరం) అనే విద్యార్థులు ప్రధానమంత్రి ర్యాలీతో పాటు, ఫ్లాగ్ ఏరియా కాంపిటీషన్ అనే రెండు విభాగాలలో పాల్గొని సత్తాచాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరులోని 25ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్దు మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే వారికి కఠోర శిక్షణ ఇవ్వడంతో పాటు పలు దఫాలుగా నిర్వహించే క్యాంపులలో ఉన్నత ప్రతిభ చూపిన విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ తమ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన యానంపై సమీక్ష చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఒక మనిషిగా కిందటి ఏడాది కన్నా కొంచెమైనా మెరుగుపడ్డామా?లేదా అనేది ప్రతి ఒక్కరూ తమ జీవన యానంపై సమీక్ష చేసుకోవాలని విశ్రాంత రాజనీతిశాస్త్ర శాఖాధిపతి ఎన్.తిరుపతయ్య అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఉగాది పండుగ పురస్కరించుకుని అవగాహన సంస్థ సభ్యుల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ నిజానికి ఈ అనంత విశ్వంలో పాత సంవత్సరం, కొత్త సంవత్సరం అంటూ ఏవీలేవని, ఈ ఎల్లలన్నీ మనం మన జీవితం ఎలా సాగుతుందో చూసుకోవటానికి మనం ఏర్పాటు చేసుకున్నవేనన్నారు. వచ్చే ఏడాదికల్లా ఇప్పటి కన్నా చాలా మెరుగైన మనిషిలా మారేలా ప్రణాళిక ఏర్పరుచుకోవాలని కోరారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ఇప్పటి కన్నా ఇంకా సంతోషంగా, శాంతంగా, ప్రేమగా అన్ని రకాలుగా ఉత్తమమైన మనిషిగా తయారవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, మురళీకృష్ణ, మొగిలి తదితరులు ఉన్నారు.

'షైనీస్ ఫిజియోథెరపీ క్లినిక్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్ పలకలూరురోడ్డులో క్లినిక్ నిర్వాహకురాలు బుర్రి అరుణ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'షైనీస్ ఫిజియోథెరపీ క్లీనిక్'ను ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ ఇంజూరీస్ స్పెషలిస్ట్, సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ అధినేత డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ హిమబిందులు ఘనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్, డాక్టర్ హిమబిందులు మాట్లాడుతూ పేషంట్‌కు వచ్చిన పెయిన్‌ను డాక్టర్ మందుల చీటీ (ప్రిస్క్రిప్షన్)లేకుండా తగ్గించేదే ఫిజియోథెరపీ అని అన్నారు. ఇది రీహాబిలిటేషనే కాకుండా ప్రివెంటీవ్‌గా కూడా ప్రాచుర్యం పొందిందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. స్పోర్ట్స్ ఇంజూరీస్ ప్రివెంటీవ్‌కు ఫిజియోథెరపీ ఎంతో దోహదం చేస్తుందని వారు పేర్కొన్నారు. సర్జరీ అయిన తరువాత ఫిజియోథెరపీ ఎంత అవసరమో సర్జరీ ముందు కూడా అంతే అవసరమన్నారు. వైద్య రంగంలో ఎంతో అనుభవం గడించిన డాక్టర్ అరుణ బుర్రి దివ్యాంగులకు, చిన్న పిల్లలకు ఆధునాతన పద్దతిలో ఈ క్లీనిక్‌లో వైద్యం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. రెవరెండ్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ హృదయ్ రంజన్ ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్‌కు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా గుంటూరు నగరం సంజీవయ్య నగర్‌లో పినపాటి ప్రభుదాస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి నాయకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, బన్నీ, గణేష్, రాజీవ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల హక్కులను పరిరక్షించాలి

విశాలాంధ్ర-గుంటూరు : పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పలువురు యూనియన్ నాయకులు అన్నారు. సేవ్ జర్నలిజం డే నిరసన ప్రదర్శనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పాల్గొని గుంటూరు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పత్రికా రంగ అస్తిత్వాన్ని, మీడియా స్వేచ్ఛను కాపాడుకోవటం కోసం జర్నలిస్టులు ఉద్యమాలు చేపట్టవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్‌తోపాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మీరా, కార్యదర్శి టి.నాగిరెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పి.భక్తవత్సలరావు, ఏకే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితులకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగాభరామరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భగీరథ సేవ ట్రస్ట్, గంగా భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో పురోహితులను సత్కరించి పంచాంగాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, పురోహితులు టి శ్యామసుందర శాస్త్రి, నాయకులు నంగళం ప్రసాదు, శివ పార్వతి, కర్నాటి శివ సత్యనారాయణ, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, దుంపల సోములు తదితరులు పాల్గొన్నారు.

Union Bank of India — పట్టాభిపురం బ్రాంచి,
1వ అంతస్థు, శ్రీ మ్యాన్షన్, మెయిన్ రోడ్, పట్టాభిపురం, గుంటూరు. ఫోన్స్ : 0863-2218718, 2230722
మెయిల్ : ubin0550884@unionbankofindia.bank

ఋణగ్రహీతకు అమ్మకము గురించిన నోటీసు (30 దినముల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూలు 6(2)/8(6)) ప్రకారం

From : చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పట్టాభిపురం బ్రాంచి, గుంటూరు (యాక్ట్ 54 ఆఫ్ 2002).

To: ఋణగ్రహీత(లు)/సహ అభ్యర్థు(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సహపూచీదారు(లు) : 1) ఋణగ్రహీత : మెస్సర్స్ నిర్మల కాటన్ ట్రేడర్స్, డి.నెం.4-5-4/88, 2వ లైను, నవభారత్‌నగర్, గుంటూరు-522007, 2) శ్రీమతి జొన్నల నిర్మల, భర్త : జొన్నల రఘురామ రెడ్డి, డి.నెం.4-5-4/88, 2వ లైను, నవభారత్‌నగర్, గుంటూరు-522007, 3) జొన్నల రఘురామ రెడ్డి, డి.నెం.4-5-4/88, 2వ లైను, నవభారత్‌నగర్, గుంటూరు-522007.

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పట్టాభిపురం బ్రాంచి వారికి ఋణపడిన పైకము వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం (2002 లోని చట్టం 54) క్రింద ఆస్తి విక్రయము గురించి.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ద్వారా మిమ్ములను మీరు మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.35,63,463/- చెల్లించమని ది.09-05-2022 న నా ద్వారా/ బ్యాంకు ద్వారా కోరినను, బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు. నేను ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది.04-10-2022 న సదరు యాక్ట్ ప్రకారం సంక్రమించిన అధికారములతో స్వాధీనం చేసుకోవడమైనది.

మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పట్టాభిపురం బ్రాంచి కు చెల్లించవలసిన మొత్తమును జమచేయలేదు. అందువలన రిజర్వుధర : రూ.1,89,00,000/- (అక్షరాలా ఒక్క కోటి ఎనభైతొమ్మిది లక్షల రూపాయలు) కంటె ఎక్కువగా ఈ దిగువ పేర్కొనబడిన ఆస్తులను ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల తరువాత ఈ-వేలము ద్వారా క్రింద ఉదహరించిన ఆస్తిని విక్రయించుట అనివార్యమైనది.

వేలం యొక్క తేది, సమయము మరియు సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయు ఈ-వేలము నోటీసు ద్వారా తెలియజేయబడుతుంది, మరియు సదరు ఆస్తి అత్యధిక ధరను ఆఫర్ చేసిన వ్యక్తికి విక్రయించబడుతుంది.

బ్యాంకు వారికి మరియు ఆసక్తిగల కొనుగోలుదారునకు ఆమోదయోగ్యమైన నియమనిబంధనలకు లోబడి ఆస్తిని ప్రైవేట్ విక్రయం లేదా వ్యక్తుల నుండి కొటేషన్లను స్వీకరించుట ద్వారా కూడా అమ్మవచ్చు కనుక, మీకు ఏదేని ప్రైవేట్ విక్రయం లేదా కొటేషన్లను స్వీకరించుట ద్వారా ఆస్తిని అమ్ము ఉద్దేశ్యము ఉన్న యెడల ఈ లెటరు/ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజుల లోపు నాకు తెలియజేయవచ్చు. లేనియెడల, మీకు అటువంటి ఉద్దేశ్యము లేదని గ్రహించి నేను పైన ఉదహరించిన విధముగా ఈ-వేలము ద్వారా ఆస్తిని అమ్ముటలో తదుపరి చర్యలను తీసుకొనెదను.

ఒకవేళ మీరు గాని ది.09-05-2022 వ తేదీన మీకు పంపిన నోటీసునుసరించి చెల్లించవలసిన పైకము, రూ.35,63,463/- తదుపరి జమకూడు వడ్డీ మరియు అన్ని విధములుగా బ్యాంకు వారికి ప్రస్తుత తేదీ వరకు అయిన రుసుములు, ఖర్చులతో సహా ఆస్తి అమ్మకమునకు నిర్దేశించిన తేదీకన్నా ముందుగా చెల్లించిన ఎడల, షెడ్యూలు లో ఉదహరించిన ఆస్తి విక్రయం నిలిపివేయబడును. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తుల ను విడిపించుకొను హక్కు కలదు.

స్థిరాస్తి వివరములు

గుంటూరు మునిసిపల్ పరిధిలోని నవభారత్ నగర్, 2వ లైను, డి.నెం.4-5-4/88-1 నందు శ్రీమతి జొన్నల నిర్మలకు చెందిన మొత్తం స్థలము 222.2 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించిన జి+1 అంతస్థులు గల రెసిడెన్షియల్ బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : 30 అ॥ ల వెడల్పు గల రోడ్డు, పడమర : అమ్మకముదారు యొక్క స్థలము, ఉత్తరం : సూదిరెడ్డి లక్ష్మి ప్రభాకరరావు యొక్క ఆస్తి, దక్షిణం : వెంకయ్య యొక్క ప్రహరీగోడ.

స్థలం : గుంటూరు
తేది : 23-03-2023

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పట్టాభిపురం బ్రాంచి, గుంటూరు.

CHANGE OF NAME

I, **GOPALAM HANUMANTHA RAO** (Old Name) D/o. GOPALAM PEDDANNA, R/o. Door No.3-15/A, Gopalam Vari Palem, Chilakaluripet, Guntur District - 522626, Andhra Pradesh, have changed my name to **GOPALAM HANVITHA**. Hereafter my name is known as **GOPALAM HANVITHA.**

టెండరు ప్రకటన

గుంటూరు జిల్లా, దుగ్గిరాల(మం),చింతలపూడి గ్రామ పంచాయతీకి ఈ దిగువ తెల్పిన షెడ్యూల్లో చూపిన సామానులు సరఫరా చేయుటకు/మనుషులు సర్వీస్ కొరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయములో కార్యదర్శి గారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని ది.30-03-2023 తేది ఉ॥గం॥11.00ల వరకు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం గం॥3.30ని॥లకు హాజరైన టెండర్ దారుల సమక్షంలో తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్లో తెలిపిన ధరావత్తు చెల్లించిన రశీదును జత పరచి టెండర్ దాఖలు చేయవలెను . ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును . ఏ కారణము తెలుపకయే టెండర్లు వాయిదా వేయుటకు లేదా మార్పులు చేయుటకు కార్యదర్శిగారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయం పనివేళల యందు సంప్రదించవచ్చును.

క్ర.నెం.	వివరములు	టెండరు ధరావత్తు
1.	2023-2024 సం॥నకు గ్రామ పంచాయతీకి అవసరమగు ప్రజారోగ్య సామానులు సరఫరాచేయుట.	100.00
	2023-2024 సం॥నకు గ్రామ పంచాయతీకి అవసరమగు పి.డబ్ల్యు.ఎస్ సామానులు సరఫరాచేయుట.	100.00
	2023-2024 సం॥నకు గ్రామ పంచాయతీకి అవసరమగు ట్యూబ్‌వెల్ సామానులు సరఫరాచేయుట.	100.00
	2023-2024 సం॥నకు గ్రామ పంచాయతీకి అవసరమగు స్టేషనరీ సామానులు సరఫరాచేయుట.	100.00
2.	2023-2024సం॥నకు గ్రామ పంచాయతీకి టెండరు పద్ధతిపై అటెండర్ పోస్టుకు (01)మనుషుల సర్వీసుకొరకు(01-04-2023 నుండి 31-03-2024వరకు)	50.00
3.	2023-2024సం॥నకు గ్రామ పంచాయతీకి టెండరు పద్ధతిపై స్వీపర్ పోస్టులు (02)మనుషుల సర్వీసు కొరకు(01-04-2023 నుండి 31-03-2024వరకు)	50.00 (ఒక్కో పోస్టుకు)

(సం॥) టి. మణికంఠము
పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ చింతలపూడి

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన రెప్కో హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెనాలి వారి తరుపున బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియ చేయునది ఏమనగా!

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, పాత గుంటూరు, జెండా చెట్టు, డోర్ నెం: 16-6-67 కాపురస్తులు రెడ్డి తిరుపతయ్య గారి కుమారుడు 1) సీతారామయ్య, ఈయన భార్య, 2) శివ కోటేశ్వరమ్మ గారు, విక్రయ అగ్రిమెంటు ద్వారా, గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కురగల్లు గ్రామం డోర్ నెం:1-232 ఎ, బి కాపురస్తులు జంపలనాతి మల్లికార్జున రావు గారి కుమారులు 1) సుబ్బారావు, 2) పోతురాజు గార్ల వద్ద నుండి విక్రయం పొందుటకు ఖరారు పడి వున్నారు. అట్టి ఆస్తిపై నా క్లయింటుకు నుండి ఋణ సౌకర్యంను అభ్యర్థించగా, నా క్లయింట్ మంజూరు చేసి వున్నారు. సదరు ఆస్తి జంపలనాతి సుబ్బారావు వగైరాలకు వారి కుటుంబ సభ్యులు ది:03-04-2012న చేసుకున్న పార్టిషన్ దస్తావేజు నెం: 4092/2012 యస్.ఆర్.ఓ. గుంటూరు రీత్యా దిగువ షెడ్యూలు ఆస్తి సంక్రమించినదని, అట్టి ఆస్తిని పై విక్రయ అగ్రిమెంటు ద్వారా రెడ్డి సీతారామయ్య వగైరాలు పొంది నాక్లయింటు వద్ద నుండి ఋణం పొందినందున సదరు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరం వగైరాలు వున్న యెడల నాకు గాని, నా క్లయింట్ గాని ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి వారం రోజులులోగా లిఖిత పూర్వకంగా వ్రాత పూర్వకమైన ఆధారాలతో క్రింద చిరునామాకు సంప్రదించ వలెను. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు నా క్లయింట్‌ను బైండు చేయజాలవు, మరియు నిర్వివాద, నిష్పేచీ ఆస్తిగా భావించ బడును.

షెడ్యూలు: గుంటూరు డి., & సబ్.డి., జి.యం.సి ఏరియాలో చేరిన గుంటూరు సిటీ, పాత గుంటూరు జెండా చెట్టు వీధి, ఇటుకల బట్టీల రోడ్డు, గుంటూరు రెవిన్యూ గ్రామం తాలూకు సర్వే నెం: 40, వార్డు నెం:10, బ్లాక్ నెం: 5, డోర్ నెం: 15-6-413, చ.గ. 64-52లు స్థలము అందులోని ఇంటికి హద్దులు తూర్పు: అ3లు వెడల్పు గల జాయింట్ నడవ దారి, అ4 - 6లు, దక్షిణం: గల్లీ బజార్ అ9లు, అక్కడినుండి వంపుగా అ11లు, అక్కడినుండి వంపుగా అ6లు వెరశి హద్దు, అ39లు, పడమర: మున్సిపల్ బజారు హద్దు, అ47-6లు, ఉత్తరం: జంపలనాతి రాఘవులు గారి ఆస్తి హద్దు, అ 33.లు.

K.Geetha Madhavi,
Advocate, D.No:1-8-2, Pulipakavari Veedhi, Nazar Pet, Tenali, Guntur Dt, Cell : 9490343121.

Notice

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT GUNTUR
I. A. No. 63 of 2023 in O.S No.5 OF 2016

Between:
Vutukuri alias Kurnala Padmalatha, W/o.Krishna Chaitanya, R/o. 2523 CARNATION DR, HARRISBURG, NC, 28075 U.S.A. - Petitioner / Plaintiff

Versus

Kurnala Krishna Chaitanya and Another - Respondents / Defendants

To,
R1) Kurnala Krishna Chaitanya, son of K. V. S. Prasad, Employee, resident of 215, Old County Road, Apt 416, BELMONT, C A 94002, U. S. A.

ఈ నెంబరు పిటీషనులో పిటీషనరు రెస్పాండెంట్స్‌పై పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన కుర్నాల కృష్ణ చైతన్య అను వారికి నోటీసు/సమనులు జారీ చేయు నిమిత్తం ది. 31-03-2023 నకు వాయిదా వేసియున్నారు. మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ, లేదా ప్లీడరు గారి ద్వారా కాని కోర్టుకు హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మిమ్ములను exparty చేసి పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా: 31-03-2023

Nallamothu Subba Rao,
M. Bala Sundari,
Advocates for Petitioner/ Plaintiff,Guntur,
Cell:9866331763

Notice

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT GUNTUR
I. A. No. 64 of 2023 in O.S No.5 OF 2016

Between:
Vutukuri alias Kurnala Padmalatha, W/o.Krishna Chaitanya, R/o. 2523 CARNATION DR, HARRISBURG, NC, 28075 U.S.A. - Petitioner / Plaintiff

Versus

Kurnala Krishna Chaitanya and Another - Respondents / Defendants

To,
R1) Kurnala Krishna Chaitanya, son of K. V. S. Prasad, Employee, resident of 215, Old County Road, Apt 416, BELMONT, C A 94002, U. S. A.

ఈ నెంబరు పిటీషనులో పిటీషనరు రెస్పాండెంట్స్‌పై పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన కుర్నాల కృష్ణ చైతన్య అను వారికి నోటీసు/సమనులు జారీ చేయు నిమిత్తం ది. 31-03-2023నకు వాయిదా వేసియున్నారు. మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ, లేదా ప్లీడరు గారి ద్వారా కాని కోర్టుకు హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మిమ్ములను exparty చేసి పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా: 31-03-2023

Nallamothu Subba Rao,
M. Bala Sundari,
Advocates for Petitioner/ Plaintiff,Guntur,
Cell:9866331763

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

క్రీడాకారుడు అబ్దుల్లాకుకు ఘన సన్మానం..

విశాలాంధ్ర-వినుకొండ: జాతీయ స్థాయి క్రీడలు, సౌత్ ఏషియన్ గేమ్స్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచిన ప్రముఖ క్రీడాకారులు పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్లాకు ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పల్నాడు జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్ ఆధ్వర్యంలో మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని నరసరావుపేట పట్టణంలో బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్లాను పలువురు ప్రముఖులు, క్రీడాకారులు, స్నేహితులు అభినందించారు.

అడవి పేరంటాళ్ళమ్మ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని బొందిలిపాలెం గ్రామంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి హుండీని గురువారం లెక్కింపు చేసినట్లు వినుకొండ ఈఓ పుణ్యాల వెంకటరెడ్డి తెలిపారు. దేవాలయంలో అమ్మవారి హుండీ లెక్కింపుతో పాటు, చీరల వేలంపాటను నిర్వహించారు. కొబ్బరికాయల వేలంపాటలో రూ.80 వేలు, కొబ్బిరి చిప్పలు రూ.24 వేలు, హుండీ ఆదాయం రూ.1.15 లక్షలు, చీరల వేలంలో రూ.31 వేలు, ఆలయ అభివృద్ధి నిమిత్తం భక్తుల విరాళాలు రూ.2.60 లక్షలు వచ్చిందని ఈఓ తెలిపారు. ఆయనతో పాటు సర్పంచి బోడాల వీరాంజినేయులు, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, సిబ్బంది ఎ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవి కరీముల్లాకు ఉగాది పురస్కారం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉగాది పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కరీముల్లా కవిత్వం సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ అనేక నూతన ఆవిష్కరణలు చేసిందని చెప్పారు. తెలుగు భాషకు గొప్ప సేవలందించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం పల్నాడు జిల్లా తరుపున ఉగాది పురస్కారం అందజేస్తుందని వ్యాఖ్యాత ప్రసాద్ పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా తరువాత తెలుగు సాహిత్యంలో కరీముల్లా తనదైన గుర్తింపును తెచ్చుకుని వినుకొండ ఖ్యాతిని ఇనుమడింపజేసినందుకు గాను అనేక మంది కవులు, కళాకారులు ప్రస్తుతించారు. అభినందించిన వారిలో పి.రమేష్ బాబు, కేశవసూరి, గాయకుడు రాజు, ప్రకాశరావు సంగీతరావు తదితరులు ఉన్నారు.

భగత్‌సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురుల వర్ధంతి

విశాలాంధ్ర - నకరికల్లు : దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాడి అతి చిన్న వయస్సులోనే ఉరి కంభం ముద్దాడి ప్రాణ త్యాగం చేసిన కామ్రేడ్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల 92వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నకరికల్లులో ఘనంగా నిర్వహించారు. ఆ ముగ్గురు దేశభక్తుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు అతి చిన్న వయస్సులో చేసిన త్యాగాలను స్మరించుకొని నేటి తరాలకు వారి త్యాగాలు ఆచరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, పిడిఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటానాయక్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్.సైదా, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, ఎంసిపిఐయు జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, లాలూ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ షేక్.మస్తాన్‌వలి, సిఐటియు గోదా చిన్న, వినుకొండ సుభాని పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక ఆదినారాయణ కాలనీలోని మండల కార్యదర్శి సైదా ఇంటివద్ద భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు అతి చిన్నవయస్సులో దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తు యువత ముందుండాలన్నారు. మండల కార్యదర్శి షేక్‌సైదా మాట్లాడుతు స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. ఎందరో కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, జింకల కోటేశ్వరరావు, సుభాని, శశిదేవి, నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్కు టు రూల్ అమలు

విశాలాంధ్ర-యడ్లపాడు: ఉద్యోగుల సమస్యల సాధనకు ఈనెల 9వతేదీ నుండి ప్రారంభించిన నిరసనలో భాగంగా గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో వర్కు టు రూల్‌ను అమలు చేశారు. సాయంత్రం 5 గంటలలకు విధులను నిలిపి వేసి తహశీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావుతో సహా అందరూ కార్యాలయానికి తాళాలు వేసి వెలుపలకు వచ్చేశారు.

నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శం

విశాలాంధ్ర-దుర్గి: సర్దార్ భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కాసుల లక్ష్మీ నారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కాలా శివయ్య అన్నారు. దుర్గిలోని గ్రంథాలయ ఆవరణలో గురువారం సర్దార్ భగత్ సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ భగత్ సింగ్ 23 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించారు. నేటి యువత మతోన్మాదం, కులతత్వంలో కురుకుపోకుండా, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చిట్టిప్రోలు అమరేశ్వరరావు, వడ్డె మధుసూధనరావు, తిప్పాబత్తుల రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విజయంపై టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర-దుర్గి : గురువారం జరిగిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ తరపున పోటీ చేసిన పంచుమర్తి అనురాధ అన్యూహంగా విజయం సాధించింది. దీంతో దుర్గిలో టీడీపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, కందుల విజయకుమార్, పగడాల చెన్నశెట్టిపల్లి నరసింహారావు, ఎస్. వెంకటేష్ పాల్గొన్నారు.

సెహరీ విందు ఏర్పాటు

విశాలాంధ్ర-వినుకొండ: రంజాన్ నెల సందర్భంగా గత 13యేళ్ల నుంచి వినుకొండ పట్టణంలోని షాదీఖానాలో నెల రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 3 గంటల నుండి ఉపవాసం ఉండే వారికి సెహరీ విందు ఏర్పాటు చేస్తారు. సెహరీకి అనుకూలం లేని వారు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని పి.ఎస్.ఖాన్ తెలిపారు.

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి: మారుతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నిరంతర సమస్యల పరిష్కారం కోసం యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం భారత స్వతంత్ర విప్లవ ధ్రువతారలు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయం నుంచి పట్టణంలోని గడియార స్థంభం సెంటర్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని వారికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపన ధ్యేయంగా సోషలిజాన్ని కాంక్షించిన భగత్ సింగ్ ఆశయాల కోసం యువత పాటుపడా లన్నారు. 23 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధులు వారన్నారు. వారు సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడితే నేడు మోడీ ప్రభుత్వం వారినే ఆహ్వానించి దేశ సంపదను కట్టబె డుతోందని అన్నారు. కోట్లాది మంది నిరుద్యోగులు ఉన్నా ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేస్తున్నా రన్నారు. అసమానతలను రూపుమాపేందుకు యువత భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోతుందని, మతపరమైన దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మళ్ళీఈ దేశం కోసం రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర సంగ్రామం తప్పేలా లేదని అందుకు యువత సిద్దంగా ఉండాలని భగత్ సింగ్ లాంటి పోరాట స్ఫూర్తి, తెగువని యువత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, నాయకులు పేలూరి రామారావు, నాయుడు శివకుమార్, మూసాబోయిన వెంకటేశ్వర్లు, గాత్రం భగత్‌సింగ్, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్ సింగ్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యోగయ్య, చెంచయ్య, నాయకులు జయ రావు, అక్కులయ్య, నాగేశ్వరరావు, బి లలితకుమారి, శివలీల, నరసమ్మ పాల్గొన్నారు.

సమాజంలో మార్పునకు యువత కృషి చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా తొలుత వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం వద్ద ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి,యువజన నాయకులు సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వినుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ బాబు మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులను అభినందించారు. సమాజంలో మార్పు కోసం యువత కృషి చేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భగత్ సింగ్ జీవిత చరిత్రను తెలుసుకొని ఆ బాటలో నడవాలని అన్నారు. ఒక మనిషి ఇంకొక మనిషిని మోసం చేయకూడదని సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ఉండాలని భగత్ సింగ్ కోరుకున్నారని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్‌ల త్యాగం చరిత్ర ఉన్నంతవరకు నిలిచిపో తుందని అన్నారు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను వక్రీకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి యువత విద్యార్థి లోకం సిద్ధపడాలని అన్నారు. ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ వాడవాడల్లో భగత్ సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని ఢిల్లీ నుండి గల్లీ వరకు ఇంక్విలాబ్ నినాదాలు మారుమోగుతున్నాయని అన్నారు. భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్‌ల పోరాట స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ చట్టాన్ని చేసి అమలు పరచాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత విద్యార్థులు రక్త దాన శిబిరంతో పాటు అనేక మంచి మంచి కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలవాలని, సర్దార్ భగత్ సింగ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. దాదాపు యాభై మందికి పైగా యువకులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవల పూడి రాము, సీపీఐ సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా, పఠాన్ లాల్‌ఖాన్, ఏఐవైఎఫ్ నాయకులు బుదాల సాగర్ బాబు, శశికుమార్, కుంచాల అఖిల్, బిల్లా కేశవ, పేరు పోగు మార్కు, బత్తుల వెంకటేష్, ప్రకాష్, కార్తీక్, లక్ష్మయ్య, రామాంజి, వంకాయలపాటి చంద్రబాబు, నాంపల్లి చిన్న, వెంకట్, శ్రీకాంత్, అనిల్, రూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపుమేరకు సేవ్ జర్నలిజం దే సందర్భంగా చిలకలూరిపేట ప్రెస్ క్లబ్, ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం చిలకలూరిపేట తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు వేతన భద్రత చట్టం ద్వారా వేతన భద్రత కల్పించాలని, జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇంటి నివేసన స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బాబ్జీ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయ అధికారి హనుమంతరావుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు జిలాని, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అన్నలదాసు శేషగిరి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీధర్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు దివి దాసు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు హాసన్ వలి, అల్లా బక్షు, నారాయణ స్వామి, బుజ్జీ, శ్రీనివాసరావు, కరిముల్ల, బుజ్జి బాబు, అశోక్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలు కొనసాగాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని సీపీఐ గురజాల నియోజకవర్గం కార్యదర్శి మందపాటి రమణారెడ్డి అన్నారు. గురువారం నారాయణపురంలో సిపిఐ కార్యాలయంలో సర్దార్ భగత్ సింగ్ రాజగురు సుకుదేవ్ల 92వ వర్ధంతి సభ జరిగింది. భగత్ సింగ్ చిత్రపటానికి యువజన సంఘ నాయకులు యడ్ల భాస్కర్, ప్రత్తిపాటి వెంకట నాగరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్ దేశ స్వతంత్ర పోరాటంలో 23 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు , సుఖదేవులు తమ ప్రాణాలను తునప్రాయంగా పెట్టి దేశం కోసం ప్రాణాలర్పించారు. నేటి యువత మతోన్మాదం కులతత్వంలో కురుకు పోకుండా మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోమెర వెంకటరావు, బుర్రి కృష్ణారెడ్డి, యడ్ల భాస్కర్, షేక్ గాలిషా సైదా, తెలనాకుల సత్యనారాయణ, తమ్మిశెట్టి శ్రీరాములు, రామయ్య, మరియదాసు , జంగాల బాబు, కోదండరామిరెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై తీర్పు రాజకీయ కుట్రలో భాగమే

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును యావత్ భారత దేశ ప్రజానికం తీవ్రంగా ఖండిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులూ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయ విమర్శలు సర్వ సాధారణమని, దానిని బూచిగా చూపిస్తూ తీర్పు ఇవ్వటం అన్యాయమన్నారు. రాజకీయ విమర్శలను కూడా స్వీకరించాలని, బీజేపీ ప్రభుత్వాల మొండి వైఖరి దురదృష్టకరమని దుయ్యబట్టారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికలలో రాహులుగాంధీ కర్ణాటకలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ మోడీ ఇంటి పేరు గల నిరవ్ మోడీ, చొక్సింగ్ మోడీ తదితరులు దేశంలోని బ్యాంకులలో లోనులు తీసుకొని దేశాన్ని విడిచి విదేశాలకు వెళ్లిన మోడీ ఇంటి పేర్లు గల ఆర్థిక నేరస్తులను విమర్శించినందుకు ఈ కేసును గుజరాత్‌లోని సూరత్‌లో బీజేపీ ఎమ్మెల్యే పెట్టిన తప్పుడు కేసు పెట్టారని చెప్పారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఆర్టికల్ 19 ప్రకారం భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించటమేనన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాదమ్ శెట్టి వేదాద్రి, పట్టణ అధ్యక్షులు జ్ఞాన్ రాజ్‌పాల్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి, జెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద' విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో ఉన్న శ్రీ వివేకానంద విద్యానికేతన్ హై స్కూల్‌లో గురువారం స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వామి ఆత్మ విధానంధజీ మహారాజ్ హాజరై విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకొని గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేవిధంగా ఉండాలని సూచించారు. స్వామి హృదానందజీ మహారాజ్ మాట్లాడుతూ మనిషి మనిషిగా జీవించటానికి ఈ ప్రపంచాన్ని మార్చగలిగిన శక్తి ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న వ్యక్తులు వల్ల మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు గోకరాజు గంగరాజు, శ్రీ వివేకానంద విద్యానికేతన్ డైరెక్టర్స్ దుర్గ ప్రసాద్ రాజు, చంద్రశేఖర రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహనుడి జయంతి

విశాలాంధ్ర-రెంటచింతల : ఆంధ్రుల ప్రథమ చక్రవర్తి శాలివాహనుడి 1945వ జయంతి వేడుక బుధవారం రెంటచింతలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శాలివాహనుడి చిత్ర పటానికి స్థానిక సర్పం పూజల పుష్పావతి రామయ్య పూల దండవేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి చేసిన సేవలను వక్త శ్రీనివాసరావు వెల్లడించారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రభాకర్, చిన్న, అంజి పాల్గొన్నారు.

పంట నష్ట వివరాలు నమోదు చేయాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను, క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట వివరాలు నమోదు చేసేందుకు వ్యవసాయ అధికారులు పొలాలకు రాకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కె.వి.ఆర్ మోహన్ చంద్ విమర్శించారు. మండలంలోని పిచ్చికలపాలెం, చిన్నకంచర్ల గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, పొగాకు, మినుము పంటలను రైతులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పొగాకు మిర్చి మొక్కజొన్న వరి వేసిన రైతులు వానకు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయ అధికారులు ఇంతవరకు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట అంచనాలు వేయకపోగా, సాకులు చెప్పటం దారుణమని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్షేత్రస్థాయిలో ఉన్న పొలాలను సందర్శించి నష్టంచనాలు వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు గణపతర్తి వెంకటేశ్వర్లు, వెంకయ్య, రైతులు ఉన్నారు.

పంటలకు నష్టపరిహారం ప్రకటించాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్ అన్నారు. స్థానిక రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా నూతనంగా ఏర్పడిన తరువాత పల్నాడు జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి, మిరప, వరి, పొగాకు, వంకాయ, దోస, కాకర, సొరకాయ, బెండకాయ తదితర పంటలు సాగుచేస్తూ రైతులు విపరీతంగా నష్టపోతే ఇంతవరకు పల్నాడు జిల్లా ఆయా మండలాలలోని గ్రామాలలోని అధికారులు నష్టపోయిన రైతుల వివరాలు తీసుకోలేదని ఇలా పంటనష్టపోయిన రైతులు ప్రభుత్వసాయం అందక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. బుధవారం గురజాల మండలం గొట్టిముక్కల గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు తన పొలంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చూసిన రైతులందరూ తమ పరిస్థితి ఏంటా అని బాధపడుతున్నారని తక్షణమే జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

చర్చి నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-బెల్లంకొండ: క్రిస్టియన్ ఆరాధ్య దైవమైన ఏసుక్రీస్తు గుడి నిర్మాణానికి రూ.101116 లు కొప్పుల వీరారెడ్డి విరాళం అందజేశారు. ఆయన వెంట వారి బంధువులు మాజీ జడ్పీటీసీ మర్రి అచ్చిరెడ్డి,పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, అక్కల వెంకట్రామిరెడ్డి ఉన్నారు. బెల్లకొండ మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన కొప్పుల వీరారెడ్డి గతంలో గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి గుడి, సత్రం నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు, ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి నిర్మాణానికి రూ.101116లు, బీసి కాలనీలో యాదవులు రామాలయ నిర్మాణానికి రూ.1,01116లు, అదేవిధంగా వడియరాజుల రామాలయ నిర్మాణానికి రూ.101116లు, జిల్లా పరిషత్ హైస్కూలులో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.110116లు, విరాళం ఇచ్చి దైవభక్తి ,సేవాభావం చాటుకున్నారని, ఆయన స్వంత గ్రామస్తుడు కావటం గ్రామస్తులు అదృష్టంగా భావిస్తున్నారు.

రంజాన్ ఉపవాసాలు ప్రారంభం

విశాలాంధ్ర - నకరికల్లు : మండల కేంద్రమైన నకరికల్లులో గురువారం నెలవంక కనపడటంతో శుక్రవారం ఉదయాన్నే ఉపవాసాలు ప్రారంభించినట్లు ముస్లిం సోదరులు తెలియజేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే నకరికల్లులోని బంగ్లాగడ్డ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో అత్యంత సమయాల్లో దూర ప్రాంతాల నుండి లారీ డ్రైవర్లు, విద్యార్థులు, ఇతర ప్రయాణాల మీద వెళ్ళేవారందరికీ, ఉపవాసాలు ఉంటున్న ప్రతి ఒక్కరికీ మసీదులో షెహరి చేసుకునే విధంగా ముస్లిం యూత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఫ్తీ సాబు మామూను అలీ మాట్లాడుతూ రంజాన్ నెల ప్రారంభోత్సవం అయిన సందర్భంగా ప్రతి ఒక్కరూ ఉపవాసాలు ఉండాలన్నారు. వారి స్తోమతకు తగిన విధంగా దానధర్మాలు చేయాలన్నారు.

ద్విచక్ర వాహనాలు, ఆటో వేలం

విశాలాంధ్ర-బెల్లంకొండ : మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు బెల్లంకొండ ఎస్సై అమీర్ గురువారం ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి డి.ఎస్.పి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు బెల్లంకొండ పోలీస్ స్టేషన్లో వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. వేలం పాడుకునేందుకు ఆసక్తి ఉన్నవారు రూ.2వేలు డిపాజిట్ చేయాలని ఆయన తెలిపారు. వేలంలో వాహనాలను సొంతం చేసుకున్న వారు మోటారు వాహనాల చట్టం క్రింద వాహనాల రిజిస్ట్రేషన్‌కు అయ్యే ఖర్చులు పాట పాడుకున్న వారే భరించాలని, నిబంధనల ప్రకారం పన్ను చెల్లించాలని ఆయన తెలియజేశారు. ఈ వేలం పాటలలో బజాజ్ ఆటో, టీవీఎస్ జూపిటర్ మోటర్ సైకిల్, బజాజ్ డిస్కవరీ మోటార్ సైకిల్, టీవీఎస్ రైడెన్ మోటార్ సైకిల్, హీరో గ్లామర్ మోటార్ సైకిల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటర్ సైకిల్, హీరో గ్లామర్ మోటార్ సైకిల్ వాహనాలను వేలం వేస్తున్నామని ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తెలంగాణలో సివిల్ జడ్జిగా ఎంపికైన పేటవాసి

విశాలాంధ్ర-నరసరావుపేట: తెలంగాణ హైకోర్టు గురువారం ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాలలో పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన కొమ్మవరపు వెంకట సాయి హరీష్ బాబు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. నకరికల్లు గ్రామానికి చెందిన కె.వి శివప్రసాద్, సువర్చలాదేవి దంపతుల రెండవ కుమారుడైన వెంకట సాయి హరీష్ బాబు నరసరావుపేటలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసి హైదరాబాదులోని ఐసిఎఫ్ఏఐ యూనివర్సిటీలో బిబిఏ ఎల్.ఎల్.బి డిగ్రీ పూర్తి చేశారు. గుంటూరులోని సీనియర్ న్యాయవాది జూపూడి రంగరాజు వద్ద జూనియర్‌గా లా ప్రాక్టీస్ చేశారు. సాయి హరీష్ బాబు తండ్రి కె వి ప్రసాద్ నరసరావుపేట పట్టణ పరిధిలోని లింగంగుంట్ల అగ్రహారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సాయి హరీష్ బాబు చిన్న వయసులో తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల పలువురు పట్టణ ప్రముఖులు, అధికారులు, బంధువులు అభినందించారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.38/2019 ఇన్ ఓ.ఎస్. 435/14

బిట్వీన్

త్రిపురమల్లు మంగమ్మ, భర్త లక్ష్మీకాంతం, పిడుగురాళ్ళ - డి.హెచ్.ఆర్.

మరియు

నాగవరపు లక్ష్మి, భర్త లేటు దుర్గా శంకరరావు, పిడుగురాళ్ళ. - జె.డి.ఆర్.

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టువారిచే ది. 26-4-2023న ఉదయం గం.10.30లకు వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు పై కోర్టువారి ఎదుట పైన తెలిపిన సమయమునకు హాజరై వేలములో పాల్గొన కోరుచున్నాము.

షెడ్యూలు : గుంటూరు జిల్లా ప్రస్తుతము పలనాడు జిల్లా నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు, పిడుగురాళ్ళ టౌన్, మరియు నగర పంచాయతీ ఆర్‌సిసి కప్పుగల నివాస గృహము డోర్ నెం. 9-165, ప్రస్తుత డోర్ నెం. 9-166, పిడుగురాళ్ళ గ్రామ డి. నెం. 163/1, విస్తీర్ణం యం. 2 1/2 సెంట్లుకు హద్దులు : తూర్పు : యర్రం శేఖర్ గృహము, దక్షిణం : చిట్టిప్రోలు శ్రీనివాసరావు గృహము, పడమర : రైల్వేస్టేషన్ రోడ్డు, ఉత్తరం : నల్లబోతుల నరసింహారావు గృహము.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.5,00,000/-

అమీనా విలువ : రూ. 10,00,000/-

ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు లేవు.

వేలం వాయిదా : 26-4-2023

(By order of the Court)

డి.ఎ. చంద్రశేఖరరావు, బి.ఎ., ఎల్.ఎల్.బి.
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
గురజాల, పిడుగురాళ్ళ,
తేది : 21-3-2023 సెల్ : 9652250060

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగబాబు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మురికిపూడి నాగబాబు ఎన్నికయ్యారు. ప్రత్యర్థి భాగ్యరావు పై నాగబాబు 36 ఓట్ల మెజారిటీ తో గెలుపొందారు. 2023- 24 సంవత్సరంకు సంబంధించి కేవలం అధ్యక్ష స్థానం కోసం మాత్రమే ఎన్నిక జరిగింది. మిగిలిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ప్రత్తిపాటి వీరయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శిగా బహుజంకు రాజేష్, ట్రెజరర్‌గా అందే శివబాబును ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా మాజీ ఏజిపి దాసరి చిట్టిబాబు, తోట శివరామకృష్ణ, పుల్లగుర శామ్యూల్ జాన్ వ్యవహరించారు.

పథకాలను వేగవంతం చేయాలి: జేసీ

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులంతా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి వెబ్ ఎక్స్ ఆన్‌లైన్ విధానం ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న ఈ సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. భూ హక్కుల స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్), భూ హక్కు పత్రాల పంపిణీ, సర్వే కొలతల దరఖాస్తుల పరిశీలన-పరిష్కారం, వ్యవసాయ భూముల పంపిణీ, ఎవన్ టైం కన్వర్షన్ పనులు 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల రీ సర్వే కు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కారం చుపాలన్నారు. జిల్లాలో పలు చోట్ల లంక భూములు ఉన్నాయని వాటిపై వెంటనే విచారణ నిర్వహించి అర్హత కలిగినవారికి పట్టాలు మంజూరు చెయ్యాలన్నారు. (సాదా బైనామా) భూముల అగ్రిమెంట్ పై కొనసాగుతున్న భూములను పరిశీలన(విచారణ) చేసి వారికి హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ త్వరిత గతిన చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం వారం రోజులు సమయం తీసుకోవాలని సూచించారు. ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

నెరవేరని ఉపాధి హామీ గ్రామ సభల లక్ష్యం

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ప్రస్తుతం గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల నందు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి, అనంతరం తనిఖీ సిబ్బంది సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. ఈ గ్రామ సభలపై ముందుగా పనులకు వచ్చిన కూలీలకు తెలిసే విధంగా గ్రామంలో దండోరా వేయించి అదరికి తెలిసేలా చేయాలి. ప్రస్తుతం ఎక్కడ కూడా ఈ విధంగా చేసిన దాఖలు లేవు. ఇప్పటి వరకు కారుమంచి, వేల్పూరు, పోట్లూరు గ్రామాలలో గ్రామసభలను నిర్వహించారు. గురువారం పోట్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలకు కూలీల కంటే కూడా ప్రజాప్రతినిధులు ఎక్కువగా సచివాలయంలోని గ్రామసభకు హజరయ్యారు. ఉదయం 12 గంటల సమయానికి కేవలం 9మంది మాత్రమే రిజిష్టరులో సంతకాలు పెట్టారు. దీనిని బట్టి కూలీల హాజరు ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. మరో పక్క గ్రామసభలకు కచ్చితంగా మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిఉండగా పొట్లూరు గ్రామ సభలో సామాజిక తనిఖీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, క్షేత్రస్థాయి కార్యదర్శి మాత్రమే సమావేశం నిర్వహించే సమయంలో ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పోట్లూరు పంచాయతీ పరిధిలో మొత్తం రూ.51లక్షలు మేర ఖర్చు చేయగా, వీటిలో రూ.27.23లక్షలు కూలీల వేతనం, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులకు రూ.21లక్షలు, గ్రామీణ నీటి సరఫరా విభాగాం ద్వారా రూ.1.83లక్షలు ఖర్చుచేసినట్లు డీఆర్పీ టి. కాజా తెలిపారు. సర్పంచి పోపూరి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి కోమటినేని అశోక్, ఏపీవో ఎం.వి.వి. రాజు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పి.నెం. 57/2022

బిట్వీన్

గుంటా సత్యనారాయణ, తండ్రి పాపయ్య, వ్యాపారం, వయసు 46 సం॥లు, డోరునెం. 13-1-214, 13వ వార్డు, సోమయ్య బజారు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా. - పిటిషనర్

మరియు

1. మారం సత్యనారాయణ, తండ్రి మల్లయ్య, వ్యాపారం, వయసు 50 సం॥లు, డోరునెం. 1-45, అలుగురాజుపల్లె, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
2. ఇమ్మడి వెంకటేష్, తండ్రి వెంకట్రావు, వ్యాపారం, వయసు 27 సం॥లు, డోరునెం. 13-12-48/1, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
3. వేముల సుబ్బారావు, తండ్రి గోపయ్య, వ్యాపారం, వయసు 50 సం॥లు, డోరునెం. 13-8-1, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
4. చిన్ని వెంకటేశ్వర్లు, తండ్రి సత్యనారాయణ, వ్యాపారం, వయసు 58 సం॥లు, డోరునెం. 13-1-8/1, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
5. మేడ రామారావు, తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, వయసు 55 సం॥లు, డోరునెం. 13-1-212, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
6. బచ్చు శ్రీనివాసరావు, తండ్రి సుబ్బారావు, వ్యాపారం, వయసు 45 సం॥లు, డోరునెం. 15-2-40, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
7. కామనబోయిన కోటయ్య, వ్యాపారం, వయసు 45 సం॥లు, డోరునెం. 21-3-58, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
8. గోపవరపు చలపతి, తండ్రి లక్ష్మయ్య, వ్యాపారం, వయసు 40 సం॥లు, డోరునెం. 27-2-51,రామాటాకీస్ లైను, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
9. చల్లంచర్ల మురళి, తండ్రి నరసింహారావు, వ్యాపారం, వయసు 40 సం॥లు, బ్రోకర్ ఆఫీసు, మెయిన్ రోడ్డు, ఆర్.అండ్.బి బంగ్లా ఎదురు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
10. గుండా వరప్రసాద్, తండ్రి చిన్న సుబ్బారావు, వ్యాపారం, వయసు 40 సం॥లు, డోరునెం. 13-5-11, పోలా వారి వీధి, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
11. గౌరు సుబ్బారావు, తండ్రి చిన్న ఆగ్గయ్య, వ్యాపారం, వయసు 45 సం॥లు, డోరునెం. 13-2-80, కాటన్ మిల్లు సమీపం, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
12. బల్లెం నరసింహారావు, తండ్రి మీరా వ్యాపారం, వయసు 46 సం॥లు, డోరునెం. 1-45/1,, ఆమ్మలమడక గ్రామము, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
13. పిన్నెల్లి రామమోహన్ రెడ్డి, తండ్రి రాఘవరెడ్డి, వ్యాపారం, వయసు 40 సం॥లు, డోరునెం. 2-70, గన్నవరం గ్రామము, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
14. కఫలవాయి సాంబశివరావు, తండ్రి ప్రసాదు, వ్యాపారం, వయసు 40 సం॥లు, డోరునెం. 3-51, దుర్గి గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.
15. బచ్చు వెంకటేశ్వర్లు, తండ్రి సత్యనారాయణ, వ్యాపారం, వయసు 38 సం॥లు, డోరునెం. 12-0, అడిగొప్పుల గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.
16. గుండా అనిల్, తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, వయసు 27 సం॥లు, డోరునెం. 4-13, అడిగొప్పుల గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.
17. కొత్తూరు నాగేశ్వరరావు, తండ్రి చిన్న పుల్లారావు, వ్యాపారం, వయసు 45 సం॥లు, డోరునెం. 2-16, అడిగొప్పుల గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.
18. బళ్లారి ముక్కంటి, తండ్రి చెంచయ్య, వ్యాపారం, వయసు 40 సం॥లు, మెయిన్ రోడ్డు, బ్రోకర్ ఆఫీసు, ఆర్.అండ్.బి బంగ్లా ఎదురు, కారెంపూడి టౌన్, కారెంపూడి మండలం, పల్నాడు జిల్లా.
19. కాకుమాను వెంకటేశ్వర్లు, ఉరఫ్ వెంకన్న తండ్రి నాసరయ్య, వ్యాపారం, వయసు 55 సం॥లు, డోరునెం. 2-98, జంగమహేశ్వరపురం, గురజాల మండలం, పల్నాడు జిల్లా.
20. కాకుమాను శ్రీకాంత్, తండ్రి వెంకటేశ్వర్లు ఉరఫ్ వెంకన్న, వ్యాపారం, వయసు 30 సం॥లు, డోరునెం. 2-98, జంగమహేశ్వరపురం, గురజాల మండలం, పల్నాడు జిల్లా.
21. శేగు గిరిజా, భర్త రంగరావు, గృహిణి, వయసు 35 సం॥లు, అంజిరెడ్డి హాస్పిటల్ వెనుక వైపు, పిడుగురాళ్ళ, పిడుగురాళ్ళ మండలం, పల్నాడు జిల్లా.
22. మద్దు ఆంజనేయులు, తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, వయసు 47 సం॥లు, డోరునెం. 2-93, మాచయపాలెం, బెల్లంకొండ మండలం, పల్నాడు జిల్లా.
23. చందూరు విజయలక్ష్మి, భర్త శంకరరావు, వ్యాపారం, వయసు 38 సం॥లు, సవేర లాడ్జి గ బజారు, హోల్సేల్ మెడికల్ షాపు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
24. కంచె శ్రీనివాసరావు, తండ్రి వెంకటనారాయణ, వ్యాపారం, వయసు 50 సం॥లు, డోరునెం. 3-47, రెంటచింతల గ్రామము, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా.
25. శ్రీరాం రాముడు, తండ్రి వెంకటశెట్టి, వ్యాపారం, వయసు 48 సం॥లు, డోరునెం. 5-89, హిల్కాలని, నాగార్జునసాగర్, పెదవూర మండలం, నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
26. గుండా రవికుమార్, తండ్రి నరసింహారావు, వ్యాపారం, వయసు 35 సం॥లు, డోరునెం. 13-2-58, సోమయ్య గారి బజారు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
27. గుండా సత్యనారాయణ, తండ్రి సీతారామయ్య, వ్యాపారం, వయసు 35 సం॥లు, డోరునెం. 13-2-89, సైదా కొట్టు బజారు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.
28. మద్దు హనుమంతరావు, తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, వయసు 55 సం॥లు, మెయిన్ రోడ్డు, ఐరన్ షాపు, కారెంపూడి గ్రామము, కారెంపూడి మండలం, పల్నాడు జిల్లా.
29. గొడపర్తి కృష్ణమూర్తి, తండ్రి సత్యనారాయణ, వ్యాపారం, వయసు 60 సం॥లు, డోరునెం. 2-93, పాపయపాలెం, బెల్లంకొండ మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు గల ఐ.పిలో పిటిషనర్ మీ పై దాఖలు చేయగా శ్రీకోర్టువారు ఐ.పి.నెం.57/2022లో నోటీసులు నిమిత్తం ది.24.03.2023వ తేదీన వాయిదా వేసియున్నారు. ఆ రోజున ఉదయం 10.30 నిమిషలకు హాజరు అవగలరు. లేని యెడల ప్రత్యేక్షముగా తీర్మానించబడను.

వాయిదా తేది : 24/3/2023

బాణావతు అమర్‌నాయక్, చాగంటి సురేష్
పిటిషనర్ తరపున న్యాయవాదులు,
గురజాల, సెల్ : 9491660688

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

శనగల అమ్మకాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-పర్చూరు: రైతులు శనగల అమ్మకాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో గురువారం బోడవాడ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ రైతులు శనగలను కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని, అయితే తేమశాతం తక్కువగా ఉండాలని, వ్యర్థాలు లేకుండా చూడాలని, రంగుమారిన వాటికి అనుమతి లేదని తెలిపారు. శనగలను డీస్టోన్ చేసుకొని తీసుకొస్తే కింటాకు రూ.5,335కు కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాలలో 10 రోజులలో నగదు జమచేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బోడవాడ పీఏసిఎస్ అధ్యక్షులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, పర్చూరు అధ్యక్షులు కుక్కపల్లి నాగేశ్వరరావు, పీడీ సీసీబి సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సీఈఓ రత్నకుమారి, కమిటీ ప్రతినిధులు ముప్పాళ్ళ రాఘవయ్య, కోటా శ్రీనివాసరావు, రైతులు ఉన్నారు.

షుగర్ నియంత్రణలో ఉంచుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : షుగర్ లెవెల్స్ ఎక్కువ ఉన్నవారు సరైన వ్యాధి నిర్ధారణ చేసుకొని, సరైన చికిత్స తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుందని ప్రముఖ జ్వరాలు షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ తులసీరామ్ అన్నారు. రోటరీ క్లబ్ క్షీరపురి చీరాల సహకారంతో చీరాల శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్‌లో షుగర్, థైరాయిడ్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ తులసీరామ్,సీనియర్ ఆత్మలిక్ ఆఫీసర్ డాక్టర్ తాడివలస కుమార్ 62 మందికి ఉచిత వైద్య సేవలను అందించి,రక్త పరీక్షలు,మందులు అందజేశారు. థైరాయిడ్ సమస్యకు మొదటి దశలో సరైన చికిత్స తీసుకోవాలని ఆరు నెలలకు ఒకసారి టోటల్ బాడీ చెకప్ మంచిదని, రోటరీ క్లబ్ క్షీరపురి సేవలు ఎంతో అమూల్యమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ క్షీరపురి అధ్యక్షులు కార్యదర్శులు నన్నప్పనేని రామకృష్ణ,బాచిన నాగమల్లేశ్వర రావు, అడ్డగడ్డ మల్లికార్జునరావు, రావి రమణారావు, మన్నెం వెంకటేశ్వర్లు, జీఎం తాడివలస సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన వీరమహిళ మృతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలో జనసేన పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణించిన విష్ణుమొలకల నాగమణి భౌతికకాయానికి జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలకు అతీతంగా నాగమణి కుటుంబాన్ని ఓదార్చి తమ తమ ప్రగాఢ సంతాపాన్ని వెల్లడించారు. నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ సమస్యల పట్ల అవగాహన కలిగి అధికార పక్షంపై తనదైన శైలిలో పోరాడిన మహిళను జనసేన పార్టీ కోల్పోవడం దురదృష్టకరమన్నారు. నాగమణి భర్త విష్ణుమొలకల చంద్రమోహన్ ఆల్ ఇండియా చిరంజీవి ఫాన్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయంను జ్ఞాపకం చేసుకున్నారు. నాగమణి కుటుంబానికి తన భర్త చంద్రమోహన్‌కు జనసేన పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బీసీలకు అన్ని రంగాలలో 80 శాతం రిజర్వేషన్ కల్పించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనను నెరవేర్చాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కులాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇష్ట గోష్టి కార్యక్రమంలో తీర్మానించారు. ఈ సందర్భంగా అన్ని కులాల నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులుగా పిలవబడుతున్న కులాలన్నిటి కలిపి 80 శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాల్లో కూడా దాన్ని అమలు చేయాలని వెల్లడించారు. అదేవిధంగా బీసీల జనగణనలను దేశవ్యాప్తంగా నిర్వహించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేయాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు బాపట్ల బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన తహశీల్దార్

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : మండలంలోని చందోలు ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలను గురువారం మండల తహశీల్దార్ సిహెచ్. సుధారాణి ఆకస్మి కంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను ఆరా తీశారు. టాయిలెట్స్, తాగునీరు వసతులు, పాఠశాల విద్యార్థులు హాజరు పట్టిక, హాజరు శాతం తదితర వివరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధ నను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని ప్రతిరోజు అందించాలని తెలియజేశారు. ఆర్ఐ అమానుల్లా, చందోలు సచివాలయం సెక్రటరీ వీరేంద్ర, సచివాలయం మహిళ సంయుక్త కార్యదర్శి శిరీష, ప్రధానోపాధ్యాయులు గీత, సిఆర్పి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ అందించండి

విశాలాంధ్ర - చీరాల : ఎస్‌డిజి సర్వేలో ఐదు సంవత్సరాలలోపు వయస్సు గల పోషకాహార లోపముతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి పోషకాహార లోపము, ఎదుగుదల,పెరుగుదల లోపముతో బాధ పడుతున్న పిల్లలకు చీరాల పట్టణంలోని అంగన్వాడీ సెంటర్ల ద్వారా బలమైన ఆహారము, బాలామృతము, గుడ్లు,పాలు మొదలైన న్యూట్రిషన్ ఫుడ్ ను అందజేయాలని మునిసిపల్ కమిషనర్ ఐసయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు ఎస్ డిజి సర్వేలో కమీషనర్ ఐసయ్య మెడికల్ ఆఫీసర్లతో, అంగన్వాడి సూపర్వైజర్లు వార్డ్ అడ్మిన్,కార్యదర్శులు, వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శులు, వార్డ్ ఎడ్యుకేషన్ కార్యదర్శులు,ఏఎన్ఎం లు, వార్డ్ ఉమెన్ పోలీస్ కార్యదర్శుల తో మండల్ కేర్ కమిటీ ను ఏర్పాటు చేసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల తల్లి తండ్రులకు కూడా పోషకాహార లోపము గురించి అవగాహన కల్పించి,పిల్లలకు బలమైన ఆహారము అందించేందుకు,ఆరోగ్య పరిస్థితులు మెరుగు పరిచేందుకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి నెల నాలుగవ గురువారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సచివలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల విజయోత్సాహం

విశాలాంధ్ర - జె.పంగులూరు : శాసనసభ్యుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడంతో గురువారం సాయంత్రం పంగులూరులో టీడీపీ కార్యకర్తలు విజయోత్సవం జరిపారు. తెలుగు దేశం అభ్యర్థి పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిందని తెలియడంతోనే కార్యకర్తలు పంగులూరు సెంటర్లో బాణాసంచా పేల్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కార్యకర్తలు మేడ సుబ్బారావు, పోదా రామంజినేయులు, చౌదరి బాబు ,రాజేష్, బుల్లోడు, జగన్నాథం సుబ్బారావు, చిలుకూరి నాగేశ్వరరావు, చిలుకూరి కోటయ్య పాల్గొన్నారు.

టీడీపీలో అంతర్గత విభేదాలు

- పార్టీ జెండా కన్నా స్వంత అజెండాతో ఇంచార్జీ వేగశన
- వేగేశన తీరుతో పార్టీకి నమ్మకమైన కేడర్ దూరం
- కొంపముంచుతున్న దురుసు ప్రవర్తన

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ బాపట్ల ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ దురుసు ప్రవర్తనతో నమ్మకమైన కేడర్ పార్టీకి దూరమవుతున్నారు. పార్టీ జెండా కంటే తన స్వంత అజెండాగా నియోజకవర్గంలో దశాబ్ధాలుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే పార్టీ వ్యక్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా తన స్వంత మనుషులతో కాలం గడుపుతున్నారు. దీంతో పార్టీ కేడర్ పార్టీకి దూరంగా ఉంటూ మౌనం వహిస్తున్నారు. బాపట్ల నియోజకవర్గంలో దశాబ్ధాలుగా ఉన్న పార్టీ నేతలను వేగేశన నరేంద్రవర్మ దూరం పెట్టాడని జోరుగా చర్చ జరుగుతుంది. పార్టీలో నేతలను కార్యకర్తలను దురుసుగా మాట్లాడటం కోపంగా ప్రవర్తిస్తుండటంతో నేతలు అంతా దూరమవుతున్నారు. బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా టీడీపీ ప్రభుత్వంలో పదవి చేపట్టిన రావిపూడి నాగమల్లేశ్వరరావు వేగేశన తీరుతో పార్టీకి దూరంగా ఉంటూ మౌనం వహిస్తున్నారు. అదేవిధంగా బాపట్ల మాజీ ఎంపీపీ మానం విజేత ఇంచార్జీతో అంతర్గ తంగా విబేధాలు ఉన్నా అదిష్టానం మాటకు శిరస్సు వహించి పార్టీ కోసం తప్పని పరిస్థితుల్లో వేగేశన వెంటే నడుస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవా నికి వేగేశన కంటే మానం విజేతకే నియోజకవర్గంలో మంచి ఫాలోయింగ్ ఉంది. ప్రతి ఒక్కరిని స్వంత మనిషిలా నవ్వుతూ పలకరిస్తారని పేరు మానం విజేత సంపాదించుకుంది. కర్లపాలెం మండలంలో టీడీపీకి అత్యంత నమ్మకమైన నక్కల వెంకట స్వామికి పార్లమెంట్ పదవి ఉన్నా వేగేశన కార్యకర్తకే పరిమితం చేశాడనేది మండలంలో బహిరంగ సత్యం. టీడీపీ పాలనలో అవినీతి మచ్చలేని నాయకుడు నక్కల వెంకటస్వామి అనటంలో ఎటువంటి సందేహం లేదని ప్రజలు నేటికి చెప్పుకుంటారు. అటువంటి వ్యక్తికి ప్రాధాన్యతను తగ్గించాడు. కర్లపాలెంలో బలమైన నాయకుడు మాజీ ఎంపీటీసీ షేక్ బాజీని సైతం వేగేశన పక్కన పక్కన పెట్టాడు. టీడీపీ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాకపోయిన వైసీపీలోకి వస్తే బిల్లులు ఇస్తామని చెప్పిన పార్టీ మారేది లేదని పార్టీకి అత్యంత నమ్మకమైన వ్యక్తిగా ఉన్నాడు. పిట్టలవానిపాలెం మండలంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న నేతల్లో చాలామంది వేగేశన ప్రవర్తన నచ్చక పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఒక్కో నాయకుడు వెయ్యి ఓటర్లను ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న నేతలు. అయిన వేగేశన తన స్వంత అంజెండా స్థాపనే లక్ష్యంగా సాగుతున్నాడు.

2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి టికెట్ ఆశించి ఆఖరి నిమిషంలో వేగేశనకు టికెట్ రాలేదు. దీంతో నియోజకవర్గంలో తన వర్గంతో సమావేశం నిర్వహించి నాకు టికెట్ రాలేదు నేను ఓటు వేయమని మిమ్ములను అడగను మీకు ఇష్టం వచ్చిన పార్టీకి ఓటు వేసుకోండని చెప్పిన వేగేశనకు పార్టీపై ప్రేమ ఏమి ఉంటుందని పలువురు టీడీపీ నేతలు నేటికి చర్చించుకుంటున్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీలో టికెట్ ఇవ్వకున్నా తన స్వంత అజెండాతో ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనతో పార్టీ నేతలను మరిచి తన స్వంత మనుషులకే ప్రాధాన్యం ఇస్తున్నారని జోరుగ చర్చ జరుగుతుంది. టీడీపీ అధిష్టానం బాపట్లలో పరిస్థితిని పరిశీలనలోకి తీసుకుని గతంలో ఉన్న నేతలు భావం తెలుసుకోవాలని పార్టీ నమ్మకమైన కేడర్ కోరుతున్నారు.

రాహుల్ అరెస్టుపై బాపట్లలో నిరసన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దేశంలో ధృతరాష్ట్ర పాలనకు నిదర్శనంగా నరేంద్ర మోడీ పరిపాలన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దోనెపూడి దేవరాజు పేర్కొన్నారు. గురువారం బాపట్లలోని పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై రాహుల్ గాంధీ అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాస్తారోకోను నిర్వహించారు. బాపట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిబాబు ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు దేవరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులను బనాయించి అరెస్టు చేయాలని కుట్ర పన్నుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. భవిష్యత్తులో ప్రధాని కాబోతున్న రాహుల్ గాంధీపై విష ప్రచారాన్ని నింపుతున్న ప్రధాని మోడీ విధానంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర పడ్డాయని జోస్యం చెప్పారు. దేశానికి దిశా నిర్దేశం రాహుల్ గాంధీ ఒక్కడేనని ప్రజలందరూ సూచిస్తున్న మోడీ ప్రభుత్వానికి తెలియకపోవడం సిగ్గుచేటని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు పటాన్ రాజేష్, ధోనిపూడి రవి, కట్ట లాజర్, బక్క రోశయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి శీలం సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎస్వీఆర్ కుమార్, దండు రేణుక, ఎస్ కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావాలను పెంపొందించేదే రంజాన్

విశాలాంధ్ర-అద్దంకి : మనిషిలోని బలహీనతలను, స్వార్థభావాలను తుడిచిపెట్టి వాటి స్థానంలో క్రమశిక్షణ, సేవాగుణం, సోదరభావాలను పెంపొందించేదే రంజాన్ ఉపవాస దీక్షా మాసమని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ముద్రించిన రంజాన్ మాసం పాకెట్ (జేబు) క్యాలండర్‌ను గురువారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించారు. నెల రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో నియమ నిష్టలతో ఉపవాసాలు ప్రారంభించబోయే ముస్లిం సోదరసోదరీమణులకు పవిత్ర రంజాన్ మాస ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ కరీముల్లా, మైనారిటీ సెల్ కార్యదర్శి బాజీ మసూద్, మీరావలి, రఫీ, ఖాదర్ భాషా, ముస్తఫా, మైనారిటీ సెల్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ లీడర్షిప్ సమ్మెట్ ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర - చీరాల : 33 దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులతో మార్చి 26వ తారీకున కోల్‌కతా నగరంలో నిర్వహించే ఎస్డిజి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే కార్యక్రమానికి సౌత్ ఇండియా తరపున చీరాలకు చెందిన గొర్రెముచ్చు ప్రేమ్ కుమార్ సౌత్ ఇండియా సెక్రెటరీగా హాజరుకానున్నారు. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యములు అనేది ప్రపంచ దేశాల ప్రతిష్టాత్మక నిబద్ధత, ఇది సమాజాల శ్రేయస్సు యొక్క ఆర్థిక, పర్యావరణ మరియు సామాజిక అంశాలను స్వీకరించే సార్వత్రిక, అపూర్వమైన ఎజెండాను నిర్దేశించిందిగా ఈ సమ్మెట్ నిర్వహించబడుతుందని తెలిపారు. సహ కరించిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ రావూరి బాలరాజుకి ప్రేమ్ కుమార్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

హనుమంతరావు వర్ధంతి

విశాలాంధ్ర - యద్దనపూడి : మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి వేడుకలను మండలంలోని గన్నవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. హనుమంతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు రంగయ్య చౌదరి మాట్లాడుతూ హనుమంతరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని, మండలంలో అన్ని గ్రామాలను అభివృద్ధికి తోడ్పాటు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పత్తిపాటి వేణుబాబు, సోమేపల్లి బాబు, సోమేపల్లి నరసింహులు, పటాన్ ఖాజావలి, షేక్ నాగర్ వలి పాల్గొన్నారు.

పల్లవసేన కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : పల్లవసేన చేస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయమని కొత్తపాలెం పంచాయతీ సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు కావలసిన స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఎవరూ ఆందోళన చెందకుండా బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పల్లవసేన సంఘం ఆధ్వర్యంలో ఇంకా మరెన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలనీ కోరారు. అనంతరం గత సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కొల్లాటి ఈశ్వరి, మొక్క నందిని స్నేహ శ్రీలకు నగదు బహుమతి, నాలెడ్జ్ బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లవసేన రాష్ట్ర నాయకులు నాయుడు నాగబాబు ,పల్లవసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు మోపిదేవి శివ నాగరాజు ,రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొక్కిలిగడ్డ నాగబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీతా నాగబాబు, ఎంపీటీసీ సభ్యులు చెక్క గోపాలకృష్ణ , ప్రిన్సిపల్ రమేష్ చంద్ర, పల్లవసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం హెచ్సిజీఎంఎస్ఆర్ కాన్సర్ సెంటర్ ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ చీరాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని హెచ్ సిజి ఎంఎస్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శరత్ బాబు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి విచ్చేసేవారు ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటలలోపు హాజరు కావాలని పాత డాక్టర్ రిపోర్ట్లు ఉంటే తీసుకొని రావాలని ఈ వైద్యశిబిరానికి డాక్టర్ వై.రామకృష్ణారెడ్డి హాజరవుతారని అన్నారు. చీరాల పురప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని పూర్తి సమాచారం కొరకు చరవాణీ నెంబర్- 9652066322,7416217474లను సంప్రదించాలని అన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిని ఉపేక్షించం

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ఆన్‌లైన్ గేమ్స్, డ్రగ్స్, క్రికెట్ బెట్టింగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని సులభతరం చేస్తుందని క్లిష్టమైన సమస్యలకు చిటికెలో చక్కటి పరిష్కారం చూపుతుందన్నారు. ఆన్‌లైన్‌లో రోజుకొక రకమైన క్రికెట్ బెట్టింగ్స్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నా యన్నారు. ఆఫర్స్ , బెట్టింగ్ ఫ్రీ అంటూ యువతను ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఒకసారి ఆడి చూద్దాం అని సరదాగా మొదలుపెట్టి వీటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయమన్నారు. ఆన్లైన్ గేమ్స్, డ్రగ్స్, క్రికెట్ బెట్టింగ్స్‌లకు పాల్పడిన వాటిని నిర్వహిస్తున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి లేదా జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబర్ 8333813228 కు లేదా యస్.ఇ.బి టోల్ ఫ్రీ నెంబర్ 14500కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో టీడీపీ నేతల హర్షం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి చెందిన పంచుమర్తి అనురాధ ఘన విజయం సాధించడం పట్ల పార్టీ శ్రేణులలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అసెంబ్లీలో సరైన సంఖ్యా బలం లేనప్పటికీ అనురాధ విజయం సాధించడం పట్ల పార్టీ నాయకులలో నూతనోత్సాహం కనిపించింది. గత నాలుగు సంవత్సరాలుగా నిశ్శబ్దంగా ఉన్న పార్టీ శ్రేణలలో విజయగర్వం తొణకిసలాడింది. మొన్న జరిగిన పట్టభద్రుల విజయం ఎమ్మెల్సీ విజయంతో రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందన్న ఆశాభావాన్ని పార్టీ నాయకులు వెలిబుచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు మిఠాయిలు పంచి సంబరాలను చేసుకున్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - బల్లికురవ : దేశ చరిత్రలో మొట్ట మొదటి సారిగా గ్రామ సచివాలయాలు,వాలంటరీ వ్యవస్థలను ఏర్పాటుచేసి అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటికే తీసుకువచ్చి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.గురువారం మండల పరిధిలోని కూకట్లపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, యువకులు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉత్సాహంగా నడిచారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చింతల పేరయ్య,వైస్ ఎంపీపీ ఇప్పల వెంకటసుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఆరుగాలం కష్టించి పనిచేసే రైతన్నకు పంట చేతికందే సమయానికి అకాల వర్షాలు గత మూడు నాలుగు రోజుల నుండి మండలంలో సంతమాగులూరు, ఏల్చూరు, కొమ్మలపాడు, కొప్పరం గ్రామాలలో రైతాంగం ఎక్కువ శాతం మిరప బొప్పాయి అరటి ఆధారం చేసుకుని ఎక్కువ మొత్తంలో పంటలు పండించి చుట్టుప్రక్కల 20 గ్రామాలకు ఉపాధిని కల్పిస్తూ ఉంటారు. ఈ నాలుగు రోజుల నుండి పడుతున్న వర్షాలతో పాటు వడగల్లు గాలి వీచటంతో కల్లాల్లో ఉన్న మిరప వర్షానికి తడిసి పూర్తిగా నష్టం వాటిల్లింది.

31న పర్చూరులో మెగా జాబ్‌మేళ

- గోడప్రతులు ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన పర్చూరు బి.ఎ.ఆర్ టి.ఎ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలియజేస్తూ గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నా మన్నారు. పరిసర ప్రాంత యువతి యువకులు ఈజాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృది అధికారి జి. సుధాకర్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ బహుళ జాతీయ కంపెనీలు హాజరవుతున్నాయని ఎంపికైన వారికి విద్యార్హత ఆధారంగా జీతం 10నుంచి 35 వేలు వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐ టి ఐ, డిప్లమో ఏదైనా డిగ్రీ, బి.టెక్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చదువుకుని 18-35 సం.ల వయసు గల నిరుద్యోగ యువతి యువకులు బయోడేటా ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలుపాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని జిల్లా ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ డి.రమేష్ బాబు తెలిపారు. మరిన్న వివరాలకు 6302764962, 7989697996 నంబర్లలో సంప్రదించాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్: 9988853335 తో పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని గరువు పాలెం గ్రామ సచివాలయంను సందర్శించి సిబ్బంది హాజరు పట్టీ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్ వివరాలు, వివిధ పథకాలకు సంబంధించిన అర్హులైన లబ్దిదారుల జాబితాలను సచివాలయంలో తప్పనిసరిగా ప్రదర్శించాల న్నారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గరువుపాలెంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించా లని ఉపాధ్యాయులకు సూచించారు. గరువుపాలెంలోని నిర్మాణంలో ఉన్న సచివాలయం నూతన భవనంను పరిశీలించారు. ఎంపీడీవో వెంట సెక్రటరీ గోపి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : పౌష్టికాహారం లోపించిన పిల్లలను గుర్తించి వారికి సక్రమ మైన మార్గంలో పౌష్టికాహారం అందించే విధంగా అంగన్వాడి వర్కర్స్, ఆశా వర్కర్లు సమూహంగా చర్యలు చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ పి.సురేష్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలు వయసు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి సరైన పోషకాహారాన్ని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడంలో ప్రతి ఒక్క అధికారి చొరవ తీసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎం. కృపా సాగర్, ఐ.సి.డి.సి.ఎస్ సూపర్వైజర్లు, కూచినపూడి, చిన్నమట్లపూడి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండ్లమ్మ ఆలయంలో నేడు వేలం పాట

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో గల కళ్యాణమండపము నందు ఫ్లవర్ డెకరేషన్, సప్లై కంపెనీ సామాన్లు అద్దెకు ఇచ్చే హక్కు లైసెన్సు పాటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తారని ఆలయ ఈవో జి.నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బిడ్డర్లు ఈ పాటలలో పాల్గొనవచ్చని అయన తెలియజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

విశాలాంధ్ర - బల్లికురవ : మధ్యాహ్నం భోజన పథకంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని డిఎల్ పీఓ శ్రీనివాసరావు,ఎంపీడీవో సిహెచ్ కృష్ణ,తాసిల్దార్ సీతరత్నం సూచించారు. గురువారం మండల పరిధిలోని వల్లాపల్లి,బల్లికురవ డిఎల్ పీఓ, ఉపమాగులూరు ఎంపీడీవో, కొత్తూరు తహసీల్దార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంగన్వాడి కేంద్రాల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈఓపిఆర్డి సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు మెండు

విశాలాంధ్ర - యద్దనపూడి : గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిరుధాన్యల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని సర్పంచ్ రేణుక అన్నారు. పోషక పక్వాడ కార్యక్రమంలో భాగంగా యద్దనపూడి రజక కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో నందు జరిగిన సమావేశంలో సర్పంచ్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్ సుజాత, జిఎంఎస్ కెబి. జ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల బస్టాండ్ లో ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అద్దంకి డిపో మేనేజర్ బెల్లం రామ్మోహన్‌రావుతో కొత్త షాపుల మ్యాపింగ్ చేయడంపై బస్టాండ్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత ట్రాఫిక్ నిబంధనలు గురించి సూచనలు చేశారు.

అకాల వర్షంతో పంటలకు నష్టం

విశాలాంధ్ర - యద్దనపూడి : ద్రోని ప్రభావంతో అకాల వర్షానికి రైతన్న కుదేలవుతున్నాడు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే దశలో ప్రకృతి కోపానికి పంట నేల పాలవుతుంది అని రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో చింతపల్లిపాడు అనంతవరం, సూరవరపు పల్లె, యద్దనపూడి గన్నవరం పూనూరు,తదితర గ్రామాలలో రైతులు పొగాకు మిర్చి శనగ పైరు అధికంగా సాగు చేశారు. మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాలకు పందిళ్ళ మీద ఉన్న పొగాకు, కళ్ళల్లో ఉన్న మిర్చి, పంటలు చేతికి అందిన పంటలు తడవటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏటా ప్రకృతి కోపానికి అన్నదాతకు కన్నీరే మిగులుతున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి పంటలు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని దైవాలరావూరు గ్రామంలో గురువారం సచివాలయాన్ని ఎంపీడీవో సురేష్ బాబు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు దగ్గర చేసేలాగా సేవలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది హౌసింగ్ సిబ్బంది జడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : జగనన్న లేఔట్ లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయించవలసిన బాధ్యత అధికారులు దేనని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డిఆర్డిఏ పిడి అర్జున్ రావు హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశపు హాలులో గృహ నిర్మాణాల పురోగతిపై సచివాలయాల వారీగా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా ఉంటే తెలియజేసినట్లయితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా లబ్దిదారులను కలసి ఇల్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణం ప్రారంభం కానీ 1585 లబ్దిదారులకు యానిమేటర్లు రూ. 35 వేలు రుణం బ్యాంకుల ద్వారా ఇప్పించి వెంటనే నిర్మాణం ప్రారంభం కాబడేలా చూడాలని ఆయన ఆదేశించారు. లబ్దిదారుల వారీగా జాబితాను తయారు చేసుకుని ప్రాధాన్యత క్రమంలో రుణాలు ఇప్పించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి ఎం.హనుమంతరావు, ఎంపీడీవో జి.చంద్రశేఖం, ఎంపీపీ డి. లలితకుమారి, జడ్పిటిసి సభ్యురాలు టి. ఉదయభాస్కరి, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.